# రహస్య ప్రక్రియ

హఠాత్తుగా
బాహ్య శరీరాన్నలా వదిలి
నాదైన శరీరంలోకి ప్రవేశిస్తాను.
భూమ్యాకర్షణ పరిధిని కూడా దాటి
పై నుండి విశ్వస్పర్శనంతా పొందుతూ!

అక్కడ
అంతర్నేత్రంతో ఆదాచేసిన సంపదనంతా
ఆనందంతో మళ్లీ మళ్లీ చూసుకుంటుంటాను.
అడపాదడపా ఏరుకొచ్చిన అవశేషాలతోను
సగంలో ఆపేసిన నైరూప్య చిత్రాలతోను
ఒక సంపూర్ణ సజీవాకృతి కోసం సంలీన మవుతాను.

ఆద్యంతం సజావుగా సాగినా
ఏదో మూల అసంతృప్తి జ్వాల
అనుక్షణం నన్ను దహిస్తూనే ఉంటుంది.
సమాధాన పడినా
సందిగ్ధంలో పడేసినా
ఏ రోజుకారోజు రహస్యంగా
ఆశతోను ఆర్తితోను
తెలిసిన వివరాలతో తెలీని ముఖాల్ని
తెలిసిన ముఖాల్లో తెలీని లోతుల్ని
అనేకానేక కోణాలలో అన్వేషిస్తుంటాను.

నా నిరంతర పరిశీలనాంశాలు

ఏ రూపానికి జీవం పోస్తాయో
ఏ లొసుగులను పూరిస్తాయో
తెలీని ప్రక్రియలో అలా కొట్టుమిట్టాడుతుంటానా!
సుఖ నిద్రా స్పర్శలో నుండి కుదిపేసినట్టు
అపస్మారక స్థితి లో నుండి బయటకీడ్చినట్టు
నన్నంటుకు తిరిగే బాహ్య శరీరాలు
నన్ను బయటకు లాక్కొస్తాయి.
వాటికెలా చెప్పను?
ఈ నా శరీరం నాది కాదని!